సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

మంగళవారం । 14 । నవంబర్ । 2023



సోమశిలలో 29.756 టీఎంసీలు

సోమశిల: సోమశిల జలాశయంలో సోమవారం సాయంత్రానికి 29.756 టీఎంసీల నీరు నిల్వ ఉంది. జలాశయానికి పైతట్టు ప్రాంతాల నుంచి 128 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	- రూ.61,700
22 క్యారెట్లు ఆర్నమెంట్ (గ్రా)	- రూ.5,547
3 శాతం జీఎస్టీతో..	- రూ.5,713
సవర (8 గ్రా)	- రూ.45,704

గరిష్టం/కనిష్టం
31.1 /24.5

వాతావరణం

సోమవారం గాలిలో తేమ 79 శాతం ఉంది. మంగళవారం ఉష్ణోగ్రతలు, ఎండతీవ్రత సాధారణంగా ఉండే అవకాశం ఉందని వాతావరణశాఖ అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

నేడు ఎంపీ విజయసాయిరెడ్డి రాక



నెల్లూరు(దర్గామిట్ట): రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వేణుంబాక విజయసాయిరెడ్డి మంగళవారం నెల్లూరుకు రానున్నారు. మధ్యాహ్నం 12.45 గంటలకు హైదరాబాద్ నుంచి రేణిగుంట విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో నెల్లూరులోని వీపీఆర్ కన్వెన్షన్ సెంటర్‌కు చేరుకుంటారు. పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు.

నేటి నుంచి సహకార వారోత్సవాలు



మాట్లాడుతున్న డీసీఓ సుధాభారతి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): అఖిల భారత సహకార వారోత్సవాలు మంగళవారం నుంచి 20వ తేదీ వరకు జరగనున్నాయి. నగరంలోని కలెక్టరేట్‌లో ఉన్న డీసీఓ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా సహకారశాఖ అధికారి సుధాభారతి మాట్లాడుతూ నగరంలోని గాంధీబొమ్మ సెంటర్ వద్ద ఉన్న జిల్లా కేంద్ర సహకార బ్యాంకు(డీసీసీబీ)లో ఉదయం 10.30 గంటలకు ఈ వారోత్సవాలను రాష్ట్ర వ్యవసాయ, సహకారశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ప్రారంభిస్తారని తెలిపారు. 14న సహకార సంఘాల్లో ఇటీవల చోటుచేసుకున్న పరిణామాలు, 15న పరపతేతర సహకార సంఘాలు, ఆర్థిక చేరిక పునరుజ్జీవం, 16న సహకార సంస్థల డిజిటలైజేషన్, సాంకేతికతను స్వీకరించడం, 17న సహకార సంస్థల ద్వారా వ్యాపారాల సరళతరం, 18న పబ్లిక్, ప్రైవేట్‌లలో సహకార భాగస్వామ్యం, బలోపేతం, 19న మహిళలు, యువత, బలహీన వర్గాల కోసం సహకార సంఘాలు, 20న సహకార విద్య, శిక్షణ, పునర్నిర్మాణం అనే అంశాలపై వారోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ వారోత్సవాలను విజయవంతం చేయాలని ఆమె కోరారు.

గ్రీకో రోమన్ చాంపియన్ నెల్లూరు

విజయవాడరూరల్: రాష్ట్ర పాఠశాలల క్రీడా సమాఖ్య నిర్వహించిన అంతర్ జిల్లాల అండర్-19 బాలికల ఫ్రీస్టైల్ రెజ్లింగ్ ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను ఆతిథ్య కృష్ణా జిల్లా జట్టు కైవసం చేసుకుంది. బాలుర చాంపియన్‌షిప్‌ను చిత్తూరు జట్టు, బాలుర గ్రీకో రోమన్ చాంపియన్‌షిప్‌ను నెల్లూరు జట్టు దక్కించుకున్నాయి. ఆంధ్రప్రదేశ్ సహకారంతో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌జీఎఫ్ఐ) కృష్ణాజిల్లా ఆధ్వర్యంలో విజయవాడ రూరల్ మండలంలోని నున్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాగణంలో నిర్వహించిన అండర్-19 బాల బాలికల రెజ్లింగ్ చాంపియన్‌షిప్ పోటీలు ఆదివారం రాత్రి ముగిశాయి. రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాల నుంచి సుమారు 320 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. అండర్-19 బాలికల ఫ్రీస్టైల్ విభాగంలో కృష్ణా జిల్లా జట్టు రెండు బంగారు, ఒక రజితం, ఐదు కాంస్య పతకాలను సాధించి 145 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచి ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకుంది. బాలుర విభాగంలో చిత్తూరు జిల్లా జట్టు మూడు బంగారు, రెండు కాంస్య పతకాలతో 105 పాయింట్లు సాధించి ఓవరాల్ చాంపియన్‌గా నిలిచింది. బాలుర గ్రీకో రోమన్‌లో నెల్లూరు జిల్లా క్రీడాకారులు రెండు బంగారు, రెండు రజితం, మూడు కాంస్య పతకాలతో 135 పాయింట్లను సాధించి చాంపియన్‌షిప్‌ను దక్కించుకున్నారు.

హోరాహోరీగా ఇంటర్ జోనల్ క్రికెట్ పోటీలు

- దేవ్‌ప్రమోద్ బ్యాటింగ్ భళా



జి.దేవ్‌ప్రమోద్


నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): బుజబుజనెల్లూరులోని సీఏపీ క్రీడామైదానంలో అండర్-16 ఇంటర్ జోనల్ క్రికెట్ పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. సోమవారం జరిగిన మ్యాచ్‌లలో సెంట్రల్ జోన్ తొలి ఇన్నింగ్స్‌లో 203 పరుగులు సాధించగా, జట్టులోని జి.దేవప్రమోద్ 103, ఎస్.రాజేష్ 89 పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్ చేసిన సౌత్‌జోన్ జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 209 పరుగులకు ఆలౌటైంది. ఈ జట్టులోని మురారి హృదయ్ 71 పరుగులు చేశారు. మధ్యాహ్నం సెంట్రల్ జోన్ రెండో ఇన్నింగ్స్‌లో 8 వికెట్లు కోల్పోయి 223 పరుగులు సాధించింది. సౌత్ జోన్ జట్టు రెండో ఇన్నింగ్స్‌లో 4 వికెట్లు కోల్పోయి 90 పరుగులు సాధించింది. మ్యాచ్ డ్రా కావడంతో తొలి ఇన్నింగ్స్‌లో అత్యధిక పరుగులు సాధించిన సౌత్‌జోన్ జట్టును విజేతగా ప్రకటించారు. పోటీలను జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సీవీఎస్‌మూర్తి, డి.నిఖిలేశ్వరరెడ్డి, సంయుక్త కార్యదర్శి కె.మునిగిరీష్, ఏసీఏ సెలెక్టర్ మలిరెడ్డి కోటారెడ్డి, జిల్లా క్రికెట్ అసోసియేషన్ అడ్వైజర్, మాజీ కార్యదర్శి డి.శ్రీనివాసరెడ్డి పర్యవేక్షించారు.

వరుణుడిపైనే ఆశలు

ప్రస్తుతం వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో జిల్లాలోని సోమశిల, కండలేరు జలాశయాల పరిధిలోని ఆయకట్టుకు సాగునీరు అందించే స్థాయిలో నీటి నిల్వలు లేవు. సోమశిల జలాశయానికి పైతట్టు ప్రాంతాల నుంచి వరద ప్రవాహం కూడా కొరవడింది. ఈ నేపథ్యంలో జిల్లాలో మొదటి పంటకు సాగునీరు అందించాల్సిన నేపథ్యంలో మంగళవారం జిల్లా సాగునీటి సలహామండలి సమావేశాన్ని నిర్వహించనున్నారు. ఈ సమావేశంలో జిల్లాలోని ఆయకట్టు, సాగునీటి వినియోగానికి సంబంధించి సాధ్యాసాధ్యాలపై చర్చించనున్నారు.

నేడు ఐఏబీ సమావేశంలో సాగునీటి విడుదలపై చర్చ

- సోమశిల జలాశయంలో 29.756 టీఎంసీలు
- కండలేరులో 11.255 టీఎంసీలు
- తాగునీటి అవసరాలకు అధిక ప్రాధాన్యం



సోమశిల జలాశయం

సాక్షిప్రతినిధి, నెల్లూరు: జిల్లా జలనిధి సోమశిల జలాశయానికి పైతట్టు ప్రాంతమైన రాయలసీమలో వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో వరద జలాల లభ్యత లేకపోయింది. ప్రస్తుతం సోమశిల జలాశయంలో 29.756 టీఎంసీల నీటి నిల్వ ఉండగా రాయలసీమ ప్రాంతాల్లో చెదురు మదురు వర్షాలకు 125 క్యూసెక్కులు మాత్రమే ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. ఈ ఏడాది వర్షాకాలంలో ఆశించిన మేర వరద జలాలు జలాశయానికి చేరుకోలేదు. దీంతోపాటు జిల్లాలో కూడా వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో చెరువుల్లో నీటి నిల్వలు కూడా తక్కువగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో నవంబర్, డిసెంబర్ నెలల్లో కురిసే వర్షాలపైనే రైతులు ఆశలు పెట్టుకున్నారు.

కండలేరులో..

ప్రస్తుతం కండలేరు జలాశయంలో 11.255 టీఎంసీల నీటి నిల్వ ఉండగా ఆ జలాశయం పరిధిలో తాగునీరు, ఇతర అవసరాలకు 5 టీఎంసీలు వినియోగిస్తే, మిగిలిన 6.255 టీఎంసీల నీటి నిల్వ మాత్రమే ఉంటుంది. పెన్నార్ డెల్టా పరిధిలో గల కనిగిరి, సర్వేపల్లి రిజర్వాయర్లలో దాదాపు 2 టీఎంసీల నీటి లభ్యత ఉంది. వాటిని కలుపుకుంటే 8.255 టీఎంసీలు మాత్రమే సాగునీటి అవసరాలకు వినియోగించుకునే అవకాశం ఉంది. ప్రస్తుత పరిస్థితుల్లో తాగునీటి అవసరాలకు మాత్రమే అధిక ప్రాధాన్యం ఉంటుంది. రాపూరు, పొదలకూరు, వెంకటగిరి, సూళ్లూరుపేట, శ్రీకాళహస్తి, తిరుపతి పట్టణ తాగునీటి అవసరాలకు పోను కండలేరు పరిధిలో గల చెరువులు, పాడి పశువుల నీటి అవసరాలకు 3 టీఎంసీలు, తాగునీటి పథకాలకు 0.4 టీఎంసీలు, పరిశ్రమలకు 1.2 టీఎంసీలు ఇవ్వాల్సిన నేపథ్యంలో కండలేరుకు దాదాపు 8 టీఎంసీల నీటిని సోమశిల నుంచి సరఫరా చేయాల్సిన అవసరం ఉంది.

మొదటి పంటకు..

గతేడాది మొదటి(రబీ) పంటకు 5.51 లక్షల ఎకరాలకు నాడు ఐఏబీ సమావేశంలో సాగునీరు అందించేలా, అందుకు 51 టీఎంసీల నీటి వినియోగాన్ని తీర్మానించగా 39.2 టీఎంసీలతో 4,63,060 ఎకరాల్లో రైతులు పంటలు పండించుకున్నారు. ఇందుకు సంబంధించి పెన్నార్ డెల్టాలో 2.47 లక్షల ఎకరాలకు 24.7 టీఎంసీలు వినియోగించారు. కనుపూరుకాలువ పరిధిలో 66 వేల ఎకరాలకు 6.6 టీఎంసీలు, కావలి కాలువ పరిధిలో ఆయకట్టుకు 12.4 టీఎంసీలు, ఉత్తర కాలువ పరిధిలోని 50,515 ఎకరాలకు 7.2 టీఎంసీలు, దక్షిణ కాలువ పరిధిలోని 38,410 ఎకరాలకు 4.2 టీఎంసీల నీటిని వినియోగించారు.

రెండో పంటకు..

అలాగే గతేడాది రెండో పంట(ఖరీఫ్)కు సంబంధించి జిల్లాలో 2.85 లక్షల ఎకరాలకు జిల్లా సాగునీటి సల హా మండలి సమావేశంలో 32 టీఎంసీలు వినియోగించేలా నిర్ణయం తీసుకున్నారు. ఈ సీజన్‌లో 3,11,239 ఎకరాల్లో రైతులు పంటలు సాగు చేసుకోగా, 37.5 టీఎంసీల నీటిని వినియోగించుకున్నారు.

సోమశిల జలాలకు ప్రాధాన్యం

జిల్లాలో తాగునీటి అవసరాలకు సోమశిల జలాశయమే ఆధారం. జలాశయం నుంచి రోజుకు దాదాపు 350 క్యూసెక్కుల నీరు తాగునీరు తదితరాల వినియోగానికి అవసరమవుతుంది. ఇలా ఏడాదిలో దాదాపు 10 నెలలపాటు జలాశయం నుంచి నీరు వినియోగించుకోవాల్సిఉంది. జలాశయంలోని దాదాపు 7.5 టీఎంసీల నీటిని సోమశిల దిగువ ప్రాంతాల చెరువులు, తాగునీటి అవసరాలకు కేటాయించాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం జలాశయంలో ఉన్న 29.756 టీఎంసీల్లో డెడ్ స్టోరేజ్, నీటి ఆవిరి కలిపి 12 టీఎంసీలు పోను నికర లభ్యత 17.8 టీఎంసీల నుంచి జిల్లా తాగునీటి అవసరాలకు 7.5 టీఎంసీలు వినియోగించాల్సిఉంది.

వర్షమే ఆధారం

గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రస్తుతం జలాశయానికి వరద ప్రవాహం కొరవడింది. జిల్లాలో జలాశయం ప్రాజెక్ట్ నివేదిక ప్రకారం వృద్ధి చెందిన ఆయకట్టుతో కలిపి 5.51 లక్షల ఎకరాలకు గాను 63.789 టీఎంసీల నీరు అవసరం ఉంది. పూర్తి ఆయకట్టుకు నీరు అందించాలంటే నవంబర్ మాసం చివరి వారంలో వర్షాలు పడే అవకాశాల మీదే ఆధారపడాల్సి ఉంది. దీనికితోడు కర్ణాటక రాష్ట్రంలో కురిసే వర్షాల వల్ల కృష్ణానదికి ఆశించిన మేర వరద జలాలు వస్తే పోతిరెడ్డిపాడు ద్వారా సోమశిలకు నీటి లభ్యత ఉంటుంది. ఇటు రాయలసీమ ప్రాంతాల్లో కురిసే వర్షాలకు తోడు కృష్ణానది జలాలతో సోమశిల జలాశయానికి నవంబర్, డిసెంబర్ నెలల్లో వరద జలాలు వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో మొదటి పంట సీజన్ డిసెంబర్ మాసంలో ప్రారంభించుకుంటే జిల్లాలోని సోమశిల, కండలేరు జలాశయాల పరిధిలో సాగునీటికి ఢోకా ఉండదని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఐఏబీ సమావేశంలో తీసుకునే నిర్ణయం మేరకు సాగునీటి విడుదల ఉంటుందని అధికారులు తెలిపారు.

16న సామాజిక సాధికార యాత్ర

- ముత్తుకూరు సెంటర్‌లో బహిరంగసభ
- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



బహిరంగ సభ జరిగే ప్రాంతాన్ని పరిశీలిస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తదితరులు

ముత్తుకూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తలపెట్టిన సామాజిక సాధికార యాత్ర ఈ నెల 16వ తేదీన సాయంత్రం సర్వేపల్లి నియోజకవర్గంలోని ముత్తుకూరులో జరుగుతుందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. ముత్తుకూరులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడారు. సామాజిక సాధికార యాత్రలో భాగంగా స్థానిక బస్టాండ్ కూడలిలో జరిగే బహిరంగ సభలో పలువురు మంత్రులు, ముఖ్య నాయకులు పాల్గొంటారని తెలిపారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో గతంలో ఎన్నడూ లేనివిధంగా సామాజిక న్యాయానికి పెద్దపీట వేశామన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, మహాత్మా జ్యోతిరావు పూలే, బాబూ జగ్జీవన్‌రామ్ వంటి ఎందరో ప్రముఖులు ఈ దేశంలో సామాజిక మార్పు కోసం పరితపించారన్నారు. అన్ని వర్గాలకు సరైన గుర్తింపు, ప్రాధాన్యత ఉండాలని కోరుకున్నారని, అందుకోసం అనేక సంస్కరణలు తీసుకొచ్చారని గుర్తుచేశారు. ఈ మేరకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కూడా సామాజిక సాధికారత కోసం కృషి చేస్తోందని తెలిపారు. ఎస్టీ, ఎస్సీ, బీసీ, మైనార్టీలను ఓటు బ్యాంకుగా కాకుండా, వారికి తగిన గుర్తింపు, ప్రాధాన్యత ఇచ్చారని తెలిపారు. మంత్రి వర్గంలో ప్రధానమైన శాఖలను వెనుకబడిన వర్గాలకు కేటాయించడమే ఇందుకు నిదర్శనమన్నారు. ఈ అంశాలతోపాటు రాజకీయాలకు అతీతంగా అన్నివర్గాల కోసం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి వివరించేందుకే ఈ యాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సీనియర్ నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి నియోజకవర్గం నలుమూలల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు హాజరవుతారని తెలిపారు. ఈ మేరకు సభ నిర్వహించే ప్రాంతాన్ని మంత్రి పరిశీలించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు రూప్‌కుమార్‌యాదవ్, మండల కన్వీనర్ మెట్ట విష్ణువర్ధన్‌రెడ్డి, ఎంపీపీ గండవరం సుగుణ, చిల్లకూరు సుధీర్‌రెడ్డి, మునుకూరు రవికుమార్‌రెడ్డి, మునుకూరు జనార్ధన్‌రెడ్డి, ఈదూరు రామమోహన్‌రెడ్డి, మందల వెంకటశేషయ్య, దువ్వూరు చంద్రశేఖర్‌రెడ్డి, ఆలపాక శ్రీనివాసులు, కోదండరామరెడ్డి పాల్గొన్నారు.

నేటి నుంచి ప్రైమ్ రిజిస్ట్రేషన్లు

- జిల్లాలోని 15 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ప్రారంభం

నెల్లూరు సిటీ: తమ ఆస్తుల రిజిస్ట్రేషన్లను ప్రజలు సులభంగా చేసుకునేలా రాష్ట్ర ప్రభుత్వం కార్డ్ ప్రైమ్ అనే కొత్త విధానాన్ని తీసుకువచ్చింది. మంగళవారం నుంచి జిల్లాలో ఈ విధానాన్ని అమలు చేయనున్నారు. జిల్లాలోని 15 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఈ విధానంలో రిజిస్ట్రేషన్లు నిర్వహించనున్నారు. ఇప్పటికే నంద్యాల, విశాఖ, అనకాపల్లి, తిరుపతి జిల్లాల్లో ప్రారంభించారు. కార్డ్ ప్రైమ్ విధానంపై జిల్లాలోని 15 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో విధులు నిర్వహించే సబ్ రిజిస్ట్రార్లు, సీనియర్ అసిస్టెంట్లకు అక్టోబర్ నెలలో విజయవాడలో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ విధానంలో రిజిస్ట్రేషన్లు త్వరగా పూర్తి కావడంతోపాటు సెక్యూరిటీ ఉంటుంది.

ఇక ఆన్‌లైన్‌లోనే..

ఇక రిజిస్ట్రేషన్ కార్యాలయాల చుట్టూ తిరగడం, అధికారుల కోసం పడిగాపులు కాయాల్సిన అవసరం ఉండదు. తమ ఆస్తుల రిజిస్ట్రేషన్లను ఇకపై ఆన్‌లైన్‌లో చేసుకునేందుకు ప్రభుత్వం కార్డ్ ప్రైమ్ విధానానికి శ్రీకారం చుట్టింది. ప్రస్తుతం రిజిస్ట్రేషన్లు పెరిగిన నేపథ్యంలో సురక్షితంగా రిజిస్ట్రేషన్ జరిగేందుకు ఈ ప్రక్రియ దోహదపడుతుంది. ఆధార్ లింక్‌తో రిజిస్ట్రేషన్లు చేయడం ద్వారా తప్పుడు రిజిస్ట్రేషన్లకు అడ్డుకట్ట వేయవచ్చు. రిజిస్ట్రేషన్‌లు చేయించుకోవాలనే వారు స్లాట్ బుకింగ్ చేసుకుని రిజిస్ట్రేషన్లు చేసుకోవచ్చు. ఆన్‌లైన్‌లోనే పేమెంట్ చెల్లింపులు చేయవచ్చు. రిజిస్ట్రేషన్ల ప్రక్రియ పూర్తయిన తరువాత వ్యవసాయ భూములు ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకోవడానికి తహసీల్దార్ కార్యాలయాలకు వెళ్లాల్సిన అవసరం ఉండదు. రిజిస్ట్రేషన్ పూర్తి కాగానే ఆటోమేటిక్‌గా మ్యుటేషన్ కూడా కొత్త విధానంలో జరుగుతుంది. రిజిస్టర్ అయిన డాక్యుమెంట్‌లను స్థానిక సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు, గ్రామ, వార్డు సచివాలయాలు, సీఏస్‌సీ, మీసేవ కేంద్రాల్లో తీసుకోవచ్చు.

పశు ఆరోగ్య కార్డుల పంపిణీ నేటి నుంచి

నెల్లూరు(సెంట్రల్): జిల్లాలోని పాడి పశువులకు సంబంధించి పశు ఆరోగ్య కార్డులను మంగళవారం నుంచి ఈ నెల 31వ తేదీ వరకు పంపిణీ చేయనున్నట్లు పశుసంవర్థకశాఖ జిల్లా అధికారి మహేశ్వరుడు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాకు సంబంధించి 2 లక్షల వరకు కార్డులు ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్డులో పశువులకు అందించే వైద్యసేవలు, ఉచిత టీకాల వివరాలు ఉంటాయని తెలిపారు.

భోళాశంకరా.. సర్వ శుభంకరా



మూలస్థానేశ్వరాలయంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు

- ప్రారంభమైన కార్తీక మాసం
- శివ నామస్మరణతో మార్మోగనున్న శైవక్షేత్రాలు
- ప్రత్యేక పూజలు చేసేందుకు ఏర్పాట్లు

ఎంతో విశిష్టత గల కార్తీక మాసం ఆరంభమైంది. జిల్లాలోని శైవక్షేత్రాలు కార్తీక శోభను సంతరించుకున్నాయి. భక్తులు ఆ పరమేశ్వరుడిని దర్శించుకుని ఏకాదశ రుద్రాభిషేకాలు, విశేష పూజలు నిర్వహించేందుకు సిద్ధమయ్యారు. ఆయా క్షేత్రాల నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



నెల్లూరులోని మూలస్థానేశ్వరాలయం



మన్నేటికోటలోని అమరలింగేశ్వరస్వామి దేవస్థానం

నెల్లూరు(బృందావనం): నెల్లూరు నగరంలోని మూలాపేటలో స్వయంభువుగా వెలసిన శ్రీభువనేశ్వరీ సమేత మూలస్థానేశ్వరస్వామి ఆలయం మహిమాన్వితమైనదిగా ప్రసిద్ధి చెందింది. శతాబ్దాల చరిత్ర కలిగిన ఈ పురాతన ఆలయ నిర్మాణానికి సంబంధించి పురాణాల ప్రకారం ముక్కంటిరెడ్డికి పెద్ద పశువుల మంద ఉంది. అతని పశువులను కాపరి మేతకు తీసుకెళ్లి తిరిగి ఇంటికి తీసుకొచ్చేవాడు. అయితే ఆ పశువుల మందలోని ఓ గోవు ఇంటికి వచ్చినా పాలు ఇవ్వకపోవడాన్ని ముక్కంటిరెడ్డి గుర్తించి పశువుల కాపరిని నిలదీశాడు. అయితే తనకేమీ తెలియదని ఆ కాపరి బదులివ్వడంతో ఆ గోవును ఓ కంట గమనిస్తుండాలని ఆదేశించాడు. పశువుల మంద నుంచి వీడిన ఆ గోవు సమీపంలోని పొదల వద్దకు వెళ్లి తన పొదుగు నుంచి పాలను ఆ పొదలలో ఉన్న రాతిపై ధారగా కురిపించడాన్ని గమనించిన పశువుల కాపరి యజమాని ముక్కంటిరెడ్డికి తెలియజేశాడు. పశువుల కాపరి కోపోద్రిక్తుడై తన వద్ద ఉన్న గొడ్డలితో పొదల్లో ఉన్న రాయిని గట్టిగా కొట్టగా ఆ రాతి నుంచి రక్తస్రావం జరిగింది. దీంతో భీతిల్లిన అతను పరుగుపరుగున ముక్కంటిరెడ్డి వద్దకు వెళ్లి జరిగిన వృత్తాంతాన్ని వివరించాడు. ఆ రోజు రాత్రి ముక్కంటిరెడ్డికి స్వప్నంలో పరమేశ్వరుడు కనిపించి ఆ శిల తన స్వరూపం శివలింగంగా పేర్కొని అక్కడ ఆలయాన్ని నిర్మించాలంటూ ఆదేశించారు. 14వ శతాబ్దంలో ముక్కంటిరెడ్డి నిర్మించిన ఈ ఆలయం ప్రస్తుతం మూలస్థానేశ్వరాలయంగా విరాజిల్లుతోంది. నెల్లూరులో ఎంతో ప్రాశస్త్యం ఉన్న ఈ ఆలయంలో కార్తీక మాసం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

చంద్రశేఖర పాహిమాం

తోటపల్లిగూడూరు: ప్రముఖ పుణ్యక్షేత్రం మండలంలోని కాటేపల్లిలో శ్రీకామాక్షిదేవి సమేత చంద్రశేఖరస్వామి ఆలయం ఎంతో ప్రసిద్ధిగాంచింది. 70 ఏళ్ల క్రితం కాటేపల్లి సముద్ర తీరాన బట్టారకం కామయ్యస్వామి ఈ ఆలయాన్ని నిర్మించారు. సముద్ర తీరాన, ఇసుక తిన్నెల మధ్య కొలువైన చంద్రశేఖరస్వామి భక్తుల కోర్కెలు తీర్చే కల్పతరువుగా ప్రశస్తి. శివరాత్రి ఉత్సవాలతోపాటు కార్తీక మాసంలో జిల్లావ్యాప్తంగా వేలాది మంది భక్తులు ఈ ఆలయాన్ని సందర్శించి స్వామివారిని దర్శించుకుంటారు. ప్రస్తుతం కార్తీక మాసాన్ని పురస్కరించుకుని భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.

సోమశిలలో సోమేశ్వరుడు

సోమశిల: అనంతసాగరం మండలం సోమశిలలోని సోమేశ్వరాలయంలో కార్తీక మాసం సందర్భంగా విశేష పూజలు నిర్వహించేందుకు నిర్వాహకులు, ఆలయ అర్చకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ మాసం మొత్తం సోమేశ్వరాలయంలో స్వామివారికి ఏకాదశ రుద్రాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. స్వామివారు విశేష అలంకరణలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. మహిళలు భక్తిశ్రద్ధలతో కార్తీక దీపాలు వెలిగించి స్వామివారిని దర్శించుకుంటారు.

భక్తుల కోర్కెలు తీర్చే అమరలింగేశ్వరుడు

ఉలవపాడు: భక్తుల కోర్కెలు తీర్చే గంగాపార్వతీ సమేత అమరలింగేశ్వరస్వామి దేవస్థానం ఉలవపాడు మండల పరిధిలోని మన్నేటికోటలో ఉంది. కార్తీక మాసంలో ఈ ఆలయంలో మహా మృత్యుంజయ హోమాలు జరుగుతాయి. ఈ ఆలయానికి ప్రత్యేక చరిత్ర ఉంది. 1300 ఏళ్ల క్రితం పల్లవ రాజులు మన్నేరు పక్కన ఈ ఆలయాన్ని నిర్మించారు. తరువాత మన్నేటి ప్రవాహానికి ఈ గుడి ఇసుకతో కప్పబడింది. 75 ఏళ్ల క్రితం ఆలయం ఆనవాళ్లు పైన కనపడడంతో ఇసుకను తొలగించారు. ఇందులో పల్లవరాజులు 1300 ఏళ్ల క్రితం నిర్మించినట్లు శాసనం బయటపడింది. 75 ఏళ్ల నుంచి ఈ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. భూమట్టానికి పూర్తిగా ఈ ఆలయం దిగువన ఉంది. కార్తీక మాసంలో ఈ ఆలయానికి భక్తులు విశేషంగా తరలివస్తారు. ఆలయ ప్రాంగణంలో ఉన్న చెట్టుకు ముడుపులు కట్టి మొక్కుకుంటారు.

పరశురాముడు నడయాడిన క్షేత్రం కోటితీర్థం

చేజర్ల: జిల్లాలోని ప్రసిద్ధ శైవక్షేత్రాల్లో చేజర్ల మండలంలోని కోటితీర్థం ఒకటి. ఈ ఆలయానికి శతాబ్దాల చరిత్ర ఉంది. పరశురాముడు మాతృ హత్యా దోషం పోవడానికి పరశురాముడు అనేక దేవాలయాలను దర్శించుకుంటూ పెన్నానదీ తీరాన కొంతకాలం ఉండి తపస్సు చేసి ఆ పరమేశ్వరుడిని భక్తితో పూజించాడని పురాణాల ద్వారా తెలుస్తోంది. ఇక్కడి శివలింగాన్ని ఆయన ప్రతిష్ఠించాడని చరిత్రకారులు చెబుతారు. ఈ క్షేత్రానికి పక్కనే పెన్నానది ఉండడంతో భక్తులు వేకువజామునే స్నానాలు ఆచరించి శివలింగాన్ని దర్శించుకుని పూజలు చేస్తుంటారు. కార్తీక మాసంలో ఈ క్షేత్రానికి భక్తులు పోటెత్తుతారు. కోటితీర్థానికి నెల్లూరు నుంచి వయా చేజర్ల మీదుగా నిత్యం బస్సు ఉంటుంది.



చేజర్ల మండలంలోని కోటితీర్థం శివాలయం

కోనలో వైభవంగా రథోత్సవం



వైభవంగా జరుగుతున్న రథోత్సవం(ఇన్‌సెట్‌లో) విశేష అలంకరణలో స్వామి, అమ్మవారు

రాపూరు: మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం పెంచలకోనలో స్వయంభువుగా వెలసిన శ్రీపెనుశిల లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో స్వాతి నక్షత్రం, దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం అత్యంత వైభవంగా రథోత్సవం నిర్వహించారు. ఉదయం సుప్రభాతం, మూలమూర్తికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి స్వామివారి మూలమూర్తిని చందనంతో అలంకరించారు. అనంతరం స్వామివారి అలంకార మండపంలో శ్రీపెనుశిల లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మీదేవి ఉత్సవ మూర్తులను కొలువుదీర్చి స్వామి, అమ్మవార్లను శ్రీకృష్ణుడు, దేవేరులుగా శోభయమానంగా అలంకరించారు. తదుపరి శాంతిహోమం నిర్వహించారు. అనంతరం దేవదేవేరులను రథంపై కొలువుతీర్చి కోనలో క్షేత్రోత్సవం నిర్వహించారు. ఈ రథోత్స వం ఆర్టీసీ బస్టాండ్ వరకు కొనసాగింది. అక్కడ ఏర్పాటు చేసిన నరకాసుని ప్రతిమను స్వామి వారి విల్లుతో దహనం చేశారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి దీపావళి పర్వదినం విశిష్టతను అర్చకులు భక్తులకు వివరించారు. కార్యక్రమంలో ఈఓ జనార్దన్‌రెడ్డి, ఆలయ ప్రధానార్చకులు రామయ్యస్వామి, పెంచలయ్యస్వామి, అర్చకులు శశిస్వామి, వినోద్‌స్వామి, నాగరాజస్వామితోపాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు..విజ్ఞాన కేంద్రాలు

• నేటి నుంచి 56వ గ్రంథాలయ వారోత్సవాలు

ఉలవపాడు/చేజర్ల: విజ్ఞాన భాండాగారాలు గ్రంథాలయాలు. ఎందరినో ఉన్నతులుగా తీర్చిదిద్దే సరస్వతి నిలయాలు. ఇక్కడ విజ్ఞానాన్ని పెంపొందించుకుని ఉన్నత శిఖరాలకు చేరిన వారెందరో ఉన్నారు. కంప్యూటర్ యుగంలోనూ పుస్తక పఠనంపైన యువత మొగ్గు చూపుతున్నారు. ఇంటర్నెట్ అందుబాటులోకి వచ్చిన తరువాత ఏ విషయమైన గూగుల్‌లో సెర్చ్ చేస్తే సులువుగా దొరుకుతుంది. కానీ పుస్తక పఠనంలో ఉన్న తృప్తి కంప్యూటర్ సెర్చింగ్‌లో లేదంటున్నారు పాఠకులు. సాంకేతికత ఎంత పెరిగినా..ఎన్ని కంప్యూటర్లు వచ్చినా గ్రంథాలయాల ప్రత్యేకత కాదనలేనిది. రాష్ట్ర వ్యాప్తంగా గ్రంథాలయ వారోత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నెల 20వ తేదీ వరకు గ్రంథాలయ వారోత్సవాల నిర్వహణకు ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. అందుకు సంబంధించి ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని గ్రంథాలయాల్లో చేపట్టాల్సిన కార్యాచరణను ప్రకటించింది. ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని 61 గ్రంథాలయాల్లో వారోత్సవాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. గ్రంథాలయాల గ్రేడ్‌ల ఆధారంగా నిధులు కేటాయించారు. జిల్లాలో గ్రేడ్ 1-3, గ్రేడ్ 2-5, గ్రేడ్ 3-43, గ్రామీణ గ్రంథాలయాలు 10 ఉన్నాయి. ఆయా గ్రంథాలయాల్లో వారోత్సవాలు జరపాలని నిర్ణయించారు.


ఉలవపాడు గ్రంథాలయ భవనం

కార్యాచరణ ఇలా....

14న వారోత్సవాల ప్రారంభ వేడుకలు, బాలల దినోత్సవం జరపాలని నిర్ణయించారు. 15న పుస్తక ప్రదర్శన, డ్రగ్స్‌పై అవగాహన, పుస్తక పఠన ప్రాముఖ్యత, 16న గ్రంథాలయ ఉద్యమానికి పాటుబడిన గ్రంథాలయ ఉద్యమకారులకు నివాళులు 17న కవి సమ్మేళనం, రచయితల సందేశాలు, సెమినార్లు, 18న విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖనం, క్విజ్ పోటీలు, క్రీడల నిర్వహణ, 19న మహిళా దినోత్సవం, దిశ చట్టం, మహిళా సాధికారితపై చర్చ, 20న డిజిటల్ లైబ్రరీల వినియోగం, స్వీయపఠనం, చదవడం మాకిష్టం కార్యక్రమం, ముగింపు కార్యక్రమం నిర్వహించాలని నిర్ణయించారు.

బడ్జెట్ కేటాయింపు..

వారోత్సవాల నిర్వహణకు బడ్జెట్‌ను ప్రభుత్వం కేటాయించింది. రెండేళ్ల ముందు బడ్జెట్ తక్కువగా ఉండేది. గత రెండేళ్ల నుంచి నిధులు స్వల్పంగా పెంచినట్లు అధికారులు తెలిపారు. జిల్లా గ్రంథాలయానికి రూ.35వేలు, గ్రేడ్1 శాఖా గ్రంథాలయానికి రూ.15వేలు, గ్రేడ్ 2 గ్రంథాలయాలకు రూ.11వేలు, గ్రేడ్ 3 శాఖా గ్రంథాలయాలకు రూ.8వేలు బడ్జెట్ లో కేటాయించారు. వారోత్సవాలకు సంబంధించిన బిల్లులు గ్రంథాలయ సంస్థకు అందజేసిన వెంటనే నిధులు అందించేలా ఏర్పాట్లు చేశారు.

వారోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి



గ్రంథాలయ వారోత్సవాలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. వారోత్సవాలను ఘనంగా నిర్వహించాలని జిల్లాలోని గ్రంథపాలకుల అందరికీ ఆదేశాలు జారీ చేశాం. నిధులు కూడా అందుబాటులో ఉన్నాయి. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిరుద్యోగులకు అవసరమైన అన్ని పుస్తకాలు అందుబాటులో ఉంచుతున్నాం. నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలి. – దొంతు శారద, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్

కసుమూరులో గుర్తుతెలియని వ్యక్తి మృతి



వెంకటాచలం: మండలంలోని కసుమూరులో గుర్తుతెలియని వ్యక్తి (50) మృతదేహాన్ని స్థానికులు సోమవారం సాయంత్రం గుర్తించారు. మెయిన్‌రోడ్డు పక్కన గుర్తుతెలియని వ్యక్తి పడిపోయి ఉండడాన్ని గమనించిన స్థానికులు అతని వద్దకు వెళ్లి పరిశీలించారు. ఎలాంటి కదలిక లేకపోవడంతో పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడు గత కొన్నేళ్లుగా కసుమూరులోనే ఉంటున్నట్లుగా గుర్తించారు. అనారోగ్య సమస్యతో మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నెల్లూరులోని జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దాబా హోటల్‌లో సర్వర్‌పై దాడి


దాడిలో గాయపడిన సర్వర్ ప్రదీప్

మనుబోలు: మండలంలోని కొండూరుసత్రం వద్ద ఉన్న కాటియా దాబా హోటల్‌లో సర్వర్‌పై ఆదివారం రాత్రి కొందరు మందు బాబులు దాడి చేశారు. వివరాలు..వెంకటాచలం మండలం ఇడిమేపల్లి గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు ఆదివారం రాత్రి పూటుగా మద్యం సేవించి దాబాకు వచ్చారు. కస్టమర్లు తిరిగే ప్రదేశంలో చేతులు కడుగుతూ అపరిశుభ్రం చేస్తుండగా సర్వర్‌గా పనిచేస్తున్న ఒడిశా రాష్ట్రానికి చెందిన ప్రదీప్ ప్రధాన్ వారిని వారించాడు. దీంతో మద్యం మత్తులో ఉన్న యువకులు బూతులు తిడుతూ ప్రదీప్‌పై కర్రలతో దాడి చేసి గాయపరిచారు. ఈ మేరకు బాధితుడు ప్రదీప్ సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

నిమ్మధరలు

పొదలకూరు (కిలో)

పెద్దవి	:రూ. 50
సన్నవి	: రూ. 20
పండ్లు	: రూ. 6

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్:	రూ.115
లేయర్	రూ.105
బ్రాయిలర్ చికెన్:	రూ.206
స్కిన్‌లెస్ చికెన్:	రూ.226
లేయర్ చికెన్:	రూ.178